క్లుప్తంగా

సమష్టి కృషితోనే అవార్డు



ప్రశంసా పత్రాలతో మెప్మా సభ్యులు

చెన్నూర్: సమష్టి కృషితోనే చెన్నూర్ మున్సిపాలిటీకి వీధి వ్యాపారులు, మహిళా సాధికరత కేటగిరిలో అవార్డు దక్కిందని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం చెన్నూర్ మున్సిపాలిటీకి అవార్డు రావడంపై మెప్మా టీఎంసీ, సభ్యురాళ్లను ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడం సంతోషదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో రుణాలు అందజేసి వీధి వ్యాపారులు, మహిళా సాధికరత కోసం మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, మెప్మా టీఎంసీ రామకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. నస్పూర్‌లోని వినూత్న కాలనీలో రూ.80లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు, అభినవ కాలనీలో రూ.15లక్షలతో చేపట్టిన కల్వర్టు, సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయించి, పట్టణ సుందరీకరణ పనులు చేయిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదిరులు పాల్గొన్నారు.


నూతన కమిటీ

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిపై సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (140/ 2018) ఫిట్ కమిటీని అసోసియేషన్ ఏరియా కన్వీనర్ డేగల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. నూతన ఫిట్ సెక్రటరీగా కొండ మహేందర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా రామచంద్ర, షిఫ్ట్ ఇన్చార్జిలుగా మిట్టపల్లి సదానందం, ఎం.వంశీకృష్ణను ఎన్నుకున్నారు.

ఉత్తమ దంపతులకు ప్రశంసా పత్రాలు

జన్నారం: మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన శ్రీరాముల సంహిత పది పాయింట్లు సాధించి, జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినందుకు గాను దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం సందర్భంగా సంహిత తల్లిదండ్రులు శ్రీరాముల సత్యనారాయణ, సంగీత ఉత్తమ తల్లిదండ్రులుగా ఎంపికై, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఉత్తమ విద్యార్థినిగా సంహిత, ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా కలమడుగు పాఠశాల హెచ్‌ఎం జాడి ప్రభాకర్ సైతం ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా కామన్‌పల్లి పాఠశాలకు చెందిన దాముక కమలాకర్ ప్రశంస పత్రం అందుకున్నారు. కలమడుగు ఉన్నత పాఠశాలకు నాలుగు ప్రశంసా పత్రాలు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటిని అమ్ముకుంటున్నారు..!



బస్టాండ్ సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో నీటిని అందిస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు, మూడు రోజులకు ఒకసారి నల్లా రావడం, కొంతసేపు మాత్రమే నీరు వస్తుండడంతో సరిపోవడం లేదు. దీంతో మున్సిపాలిటీ నుంచి 12 ట్రాక్టర్లు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి నివారణకు కాలనీల్లో ట్రాక్టర్ల ద్వారా తాగునీరు అందించాల్సి ఉంది. కానీ మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, తాగునీటికి డిమాండ్ బాగా పెరగడంతో సిబ్బంది వారి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. కమర్షియల్ వారికి ఈ వేసవిలో తాగునీటిని అందించకుండా, కేవలం ప్రజలకు మాత్రమే తాగునీటిని ఆయా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి ఉంటుందని పాలకవర్గం సైతం మున్సిపల్ అధికారులకు సూచించింది. తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతరత్ర భవనాలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పాలకవర్గంకు ఈ విషయం తెలిసినా, ప్రజల బాధలు పట్టించుకోకుండా, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నా పట్టింపు లేకుండా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా యోగా డే

జిల్లా కేంద్రంలో వనితా వాక్కు ఆధ్వర్యంలో యోగాసనాలు వేస్తున్న మహిళలు





బెల్లంపల్లిరూరల్: యోగాసనాలు వేస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయిలు



ఎస్టీపీపీలో యోగా చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా యోగా డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను పలువురు వక్తలు తెలియజేశారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని, యోగా సాధన వల్ల మానసిక ప్రశాంతత, శరీర ధారుడ్యం కలుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా పలువురు యోగా ట్రైనర్లను సన్మానించారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కన్నెపల్లిలో యోగా సాధనలో విద్యార్థులు



దేవాపూర్‌లో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, పోలీసులు



మందమర్రిరూరల్: యోగా చేస్తున్న జీఎం మోహన్‌రెడ్డి



బెల్లంపల్లి: మాట్లాడుతున్న ఏమాజీ



భీమారంలో యోగా చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నస్పూర్‌లో...



కాసిపేట2 గనిపై ...



పాతమంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో...



చెన్నూర్: యోగా ట్రైనర్‌ను సన్మానిస్తూ..



లక్సెట్టిపేటలో యోగా వేడుకలు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో శంకరయ్య

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై సాక్షిలో 'చోరీల పరంపర' శీర్షికన ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య బుధవారం హన్మాన్‌బస్తీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించడం పోలీసుల బాధ్యతన్నారు. బస్తీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులు కన్పిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల, మోసగాళ్ల మెస్సెజ్‌లకు, ఫోన్లకు స్పందించవద్దని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వివరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సెలర్ రాజ లింగు, ఏఎస్సైలు తిరుపతి, మునీర్, మాజీ కౌన్సెలర్ శంకర్ సింగ్, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

సభ్యత్వం పొందాలి

పాతమంచిర్యాల: పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి పద్మశాలి కులస్తుడు రాష్ట్ర పద్మశాలి సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలి కులస్తులను ఏకతాటిపైకి తీసుకురావడానికి రాష్ట్రమంతా పర్యటిస్తూ సభ్యత్వ నమోదు చేస్తున్నామని, పద్మశాలిల అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. సభ్యత్వం పొందిన సభ్యులు రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి: ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) 73వ వార్షికోత్సవ పోస్టర్లను బుధవారం ఆ సంఘం శ్రేణులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సాగర్, ఏఐఎస్‌బీ శ్రేణులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆధ్యాత్మిక దినోత్సవం



విశ్వనాథ ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే దివాకర్‌రావు



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య



చెన్నూర్: రౌండ్ హనుమాన్ టెంపుల్‌లో...

బెల్లంపల్లిరూరల్/బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో, బెల్లంపల్లిలోని శ్రీకోదండ రామాలయంలో వేద పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య శ్రీ గణపతి హోమం, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై హోమం, రాజేశ్వరుడి పాలాభిషేకంతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయా ఆలయాల్లో దూప దీప నైవేద్యాలతో పూజలు చేస్తున్న అర్చకులకు రాష్ట్ర దేవాదాయ శాఖ నుంచి మంజూరైన సర్టిఫికెట్లను చిన్నయ్య అందజేశారు. ఆయా చర్చిల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా క్రైస్తవ సమూహం పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే చిన్నయ్య ఆ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి, సర్పంచ్ స్వరూప, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, ఆలయ ఈవో బాపురెడ్డి, ధర్మకర్తలు గోపి, సంతోష్, క్లర్క్ భాను, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట/మంచిర్యాలఅర్బన్: ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి దేవస్థానంలో, లక్సెట్టిపేటలోని సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన కార్యక్రమాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా విశ్వనాథ స్వామి దేవస్థానాన్ని, సీఎస్ఐ చర్చిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ క్షేమంగా ఉండాలని పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. చర్చిలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమాల్లో మంచిర్యాలలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీపతి శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేష్, స్థానిక కౌన్సిలర్లు పాల్గొనగా, లక్సెట్టిపేటలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్/చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో మదునంపోచమ్మ, రౌండ్ హనుమాన్ టెంపుల్, ఒత్కులపల్లిలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం, కత్తెరసాలలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్‌సార్ వర్ధంతి



విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...



భీమారంలో నివాళులర్పిస్తున్న నాయికులు

పాతమంచిర్యాల: తెలంగాణ సిద్ధాంత కర్త, తెలంగాణ ఉద్యమ జ్యోతి ప్రొఫెసర్ జయశంకర్‌సార్ ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టెల రమేష్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం జయశంకర్‌సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతిపట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, ప్రధాన కార్యదర్శి జక్కుల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేష్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మడుపు రాంప్రకాష్, చింతల మల్లేష్, హరీష్, కోటోజు రమేష్, పట్టణ కార్యదర్శి రామోజు రమేష్‌బాబు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో శ్రీ కృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సంఘం ప్రధానకార్యదర్శి మెండె మల్లేశ్, సంఘ సభ్యులు జయశంకర్ సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బెల్లంపల్లి: జయశంకర్‌సార్ వర్ధంతిని బుధవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

కాసిపేట/చెన్నూర్: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ వర్ధంతిని కాసిపేటలో భారత జాగృతి, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం ఆధ్వర్యంలో, చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొమ్ముల బాపు, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో...

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'



మాట్లాడుతున్న బానయ్య

బెల్లంపల్లి: తనపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని బహిష్కృత తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు దాసరి బానయ్య తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఎల్తూరి శంకర్, మరో ముగ్గురు నాయకులు తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ఆ విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. అమావాస్య రోజు నిర్వహించే సమావేశంలో తనపై ఆరోపణలు చేసిన నాయకులు కార్మికులకు లెక్కలు వివరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కాంపల్లి నారాయణ, అశోక్, సత్తి, చిలుముల శ్రీనివాస్, కుమార్, రాకేష్, పోశం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ఆగడాలు ఆపాలి

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన ఓ మహిళకు, ఆమె భర్తకు మధ్య ఉన్న వివాదాన్ని చక్కదిద్దుతానంటూ ఆ మహిళ ఇంటి సమీపంలోనే ఉన్న బీఆర్‌ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు బింగి ప్రవీణ్‌ను సహాయం కోరితే ఆ మహిళనే వేధించడం సరికాదని, అతడిపై చర్యలను తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రవీణ్‌పై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వెంటనే ప్రవీణ్‌ను బీఆర్‌ఎస్ పదవుల నుంచి తప్పించి, పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం

జైపూర్: మండలంలోని టేకుమట్ల గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ గోనే బాలరాజు, ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రూ.43వేల ఆర్థిక సాయం అందజేశారు.

'గడపగడపకూ కాంగ్రెస్ పాదయాత్ర'

చెన్నూర్‌రూరల్: మండలంలోని సంకారం, కన్నెపల్లి, బుద్దారం గ్రామాల్లో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర కొనసాగింది. చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేష్ ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమాచారం

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

చెన్నూర్‌రూరల్/దండేపల్లి: తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా రైతులకు అందించే పెట్టుబడి సాయం పొందుటకు కొత్తగా పాస్‌బుక్‌లు వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవాలని చెన్నూర్ ఏవో కవిత, రైతుసమితి జిల్లా కన్వీనర్ మోటపల్కుల గురువయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొంది, ఆన్‌లైన్ డీఎస్ అయిన రైతులు 2023–24సంవత్సరానికి గాను రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు మండల సమావేశం

నెన్నెల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో హాజరుకావాలన్నారు. ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరైతే, సంబంధిత అధికారులపై తగు చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు అమరవీరుల సంస్మరణ సభ

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల సంస్మరణ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రేపు ఇంటర్ ఫస్టియర్ స్పాట్ కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ఇంటర్ కళాశాలలో ఫస్టియర్ అడ్మిషన్ కోసం శుక్రవారం స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని స్కూల్ ప్రిన్సిపల్ జయకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 4 సీట్లు, బైపీసీలో ఓపెన్ క్యాటగిరిలో 6, ఎస్టీ క్యాటగిరీలో 1సీటు, సీఈసీ గ్రూపులో ఓపెన్ క్యాటగిరిలో 6, ఎస్టీ క్యాటగిరిలో 3, బీసీ(ఏ) క్యాటగిరిలో 1, బీసీ(బీ) క్యాటగిరిలో 2సీట్లు, బీ సీ(ఈ) క్యాటగిరిలో 1సీటు భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్ మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని తెలిపారు. సకాలంలో విద్యార్థులు సంబంధిత స్టడీ సర్టిఫికెట్స్, ధ్రువ పత్రాలతో హాజరై అడ్మిషన్ పొందాలని సూచించారు.

26న వేలం

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో పనికిరాకుండా ఉన్న మొత్తం 12వాహనాలకు ఈ నెల 26న బహిరంగ వేలం వేయనున్నట్లు బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వేలం ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొన దలిచిన వ్యక్తులు షెడ్యూల్ ఫారం కోసం మున్సిపల్ కమిషనర్ బెల్లంపల్లి పేరు మీద రూ.5వేలు చెల్లించి తీసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.